

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 03-07-2025 | సంపుటి - 24 సంచిక - 60 రూ : 4 | పేజీలు: 8




## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం.. దేశం దాటిస్తాం

- తీవ్ర నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను దేశం నుంచి బహిష్కరించాలని ట్రంప్ ప్రతిపాదన
- ఫ్లోరిడాలోని వలసదారుల నిర్బంధ కేంద్రంలో సంచలన వ్యాఖ్యలు
- దేశంలో పుట్టినవారికైనా, పౌరసత్వం పొందినవారికైనా ఇది వర్తిస్తుందని వ్యాఖ్య
- దీనిపై చట్టపరమైన స్పష్టత లేదని స్వయంగా అంగీకారం
- ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణుల హెచ్చరిక
- కొన్ని నేరాలకు పాల్పడిన సహజ పౌరుల పౌరసత్వం రద్దుకు ఇప్పటికే చర్యలు

2లో

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యులు సేవలు అందించాలి!

: సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

- కార్పొరేట్ వైద్యులు నెలకు ఒకసారైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవ చేయాలని విజ్ఞప్తి
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు వెల్లడి
- రూ. 3 వేల కోట్లతో ఉస్మానియాకు కొత్త భవనం, నిమ్స్‌లో మరో 2 వేల పడకలు
- డిసెంబర్ 9 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 7 వేల పడకలతో కొత్త ఆసుపత్రులు

2లో






## దేశానికి ఆదర్శంగా విపత్తు నిర్వహణ అథారిటీ

- నదీ పరీవాహక ప్రాంతాల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు
- టీజీఎస్‌డీఎంఏపై సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థను బలోపేతం చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ సంస్థను తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ(టీజీఎస్‌డీఎంఏ)గా తరువాయి 2లో



## పాక్ లో మరోసారి ఉగ్రదాడి... సీనియర్ అధికారి సహా ఐదుగురి మృతి

2లో

- పాకిస్థాన్‌లో రోడ్డు పక్కన అమర్చిన బాంబు పేలుడు
- ప్రభుత్వ అధికారి సహా ఐదుగురి దుర్మరణం
- మరో 11 మందికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని బజౌర్‌లో ఘటన
- పాకిస్థానీ తాలిబన్ల పనేనని అధికారుల అనుమానం

## మేడారం జాతర తేదీలు ఖరారు.. జనవరి 28 నుంచి మహా వేడుక!

మేడారం మహాజాతర తేదీలను ప్రకటించిన పూజారులు

- వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జాతర నిర్వహణ
- ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి
- జనవరి 28న గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- 29న చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి ఆగమనం
- 31న వనప్రవేశంతో జాతరకు ముగింపు

2లో







## ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

: సీఎం చంద్రబాబు

2లో

- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ
- ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు
- స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- అభివృద్ధి ద్వారా వచ్చిన ఆదాయంతోనే సంక్షేమం అమలు చేస్తామన్న చంద్రబాబు
- విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని వెల్లడి

## ఎక్తా గ్రూప్‌తో కలిసి
# గుడ్‌వర్క్స్ కోవర్క్ హైదరాబాద్‌లో ఎంట్రీ

- **మేనేజ్‌డ్ ఆఫీసులు, జీసీసీ ఎనేబుల్‌మెంట్ లక్ష్యంగా వ్యూహాత్మక విస్తరణ**



హైదరాబాద్, జూలై 2, (ప్రజాస్ఫూర్తి): భారతదేశంలో ప్రీమియం మేనేజ్‌డ్ ఆఫీసుల ప్రొవైడర్‌గా పేరుగాంచిన గుడ్‌వర్క్స్ కోవర్క్, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఎక్తా గ్రూప్‌తో భాగస్వామ్యంగా హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న జీసీసీ మరియు ఎంటర్‌ప్రైజ్ హబ్‌లను దృష్టిలో పెట్టుకొని ఈ విస్తరణను ప్రకటించింది. ఈ భాగస్వామ్యంతో హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల్లో కలిపి 1.5 లక్షల చదరపు అడుగుల 'గ్రేడ్ ఎ' కార్యాలయ స్థలం అభివృద్ధి చేయనున్నారు. స్టార్టప్‌లు, స్కేల్‌అప్‌లు, జీసీసీలకు అనుకూలంగా మేనేజ్‌డ్, స్కేలబుల్ సొల్యూషన్లను అందించనున్నారు. గుడ్‌వర్క్స్ "సంసోవీ జీసీసీ" అనే ప్రత్యేక ప్లాట్‌ఫాంను ప్రారంభించనుంది. ఇది విదేశీ సంస్థలకు భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వనరులు, నిబంధనలు, టాలెంట్, సలహా సేవలు అందిస్తుంది. హైదరాబాద్ దీని కేంద్రంగా నిలవనుంది. గుడ్‌వర్క్స్ కో ఫౌండర్ మరియు సీఈఓ విశ్వాస్ ముదగల్ మాట్లాడుతూ, "హైదరాబాద్ ఇప్పుడు జీసీసీల విస్తరణకు కేంద్రబిందువు. ఎక్తా గ్రూప్‌తో కలిసి మేము ఆఫీసులతో పాటు భారత మార్కెట్ ప్రవేశానికి సేవల్ని కూడా అందించబోతున్నాం" అని తెలిపారు. ఎక్తా గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస ముసాని మాట్లాడుతూ, "గుడ్‌వర్క్స్‌ను స్వాగతించడం మాకు ఆనందం. ఈ భాగస్వామ్యం గ్లోబల్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే కార్యాలయ అభివృద్ధికి దోహదం చేస్తుంది. త్వరలో విశాఖపట్నం, విజయవాడలలో కూడా విస్తరిస్తాం" అని అన్నారు. ప్రస్తుతం గుడ్‌వర్క్స్ దేశవ్యాప్తంగా 8 లక్షల చదరపు అడుగుల కార్యాలయాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్ కేంద్రాల ప్రారంభంతో ఈ స్థాయి 10 లక్షల చదరపు అడుగులకు చేరనుంది. హైటెక్ సిటీలో తొలి కేంద్రం 2025 మూడో త్రైమాసికంలో ప్రారంభం కానుండగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కేంద్రం ఏడాది చివర్లో ప్రారంభమవుతుంది. ఈ వ్యూహాత్మక అడుగు గుడ్‌వర్క్స్ మరియు సంసోవీ బ్రాండ్‌లను భారతదేశంలో ప్రముఖ జీసీసీ పరిష్కారాలుగా నిలబెడుతుంది.

# ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం నాడు కుప్పంలో పర్యటించిన ఆయన, 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు. "అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదు," అని ఆయన అన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు. 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మహిళల కోసం 'దీపం 2.0' పథకాన్ని ప్రస్తావించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన 'దీపం' పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు 'దీపం 2.0' ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యులు సేవలు అందించాలి!

కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు తమ సామాజిక బాధ్యతగా ఏడాదికి కనీసం ఒక నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సామాన్య ప్రజలకు సేవ చేయడం ద్వారా వైద్య వృత్తిలో గొప్ప అనుభూతి, ఆత్మసంతృప్తి లభిస్తాయని ఆయన అన్నారు. బుధవారం నాడు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఏఐజీ (AIG) ఆసుపత్రి నూతన విభాగాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పోతాయనే అపోహను ప్రజల నుంచి తొలగించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రికి 30 ఎకరాల స్థలంలో రూ. 3 వేల కోట్ల వ్యయంతో అధునాతన భవనాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. అలాగే, నిమ్స్‌లో మరో 2 వేల పడకల విభాగాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు వరంగల్, అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రులతో కలిపి వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్రంలో కొత్తగా 7 వేల పడకలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

**కొత్త వేదిక ఏర్పాటుకు సూచన**

కార్పొరేట్ రంగంలో, విదేశాల్లో స్థిరపడిన వైద్యులు రాష్ట్రంలో సేవలు అందించాలనుకున్నా, అందుకు సరైన వేదిక లేదని ముఖ్యమంత్రి అన్నారు. "అమెరికాలో స్థిరపడిన మన రాష్ట్ర వైద్యులు ఇక్కడికి వచ్చినప్పుడు వారి సేవలను వినియోగించుకోవడానికి ప్రస్తుతం ఒక ప్లాట్‌ఫామ్ లేదు. అలాంటి వారికోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించాం" అని ఆయన తెలిపారు. ఈ వేదిక ద్వారా కార్పొరేట్ వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రులతో అనుసంధానమై పేదలకు సేవ చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత**

ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు తాము అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద ఇప్పటివరకు రూ. 1,400 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ. 11,500 కోట్లు, విద్యారంగానికి రూ. 21 వేల కోట్లు కేటాయించామని వివరించారు.

**మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న కోటి మంది మహిళల ఆరోగ్య వివరాలతో హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల్లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నివారణ చర్యల్లో భాగంగా వారందరికీ ప్రత్యేక ఐడీ నంబర్‌తో కూడిన హెల్త్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. క్యాన్సర్ చికిత్సలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో ఆరోగ్య రంగానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించామని, డాక్టర్ నాగేశ్వర రెడ్డి వంటి నిపుణుల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ ఆసుపత్రి సేవలను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 65 దేశాల నుంచి రోగులు చికిత్స కోసం ఏఐజీకి రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. మన నర్సులకు జపాన్‌లో మంచి డిమాండ్ ఉన్నందున, వారికి జపనీస్ భాషలో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## మేడారం జాతర తేదీలు ఖరారు..
# జనవరి 28 నుంచి మహా వేడుక!

కోట్లాది మంది భక్తులు ఆరాధించే వనదేవతలు సమ్మక్క, సారలమ్మల జాతరకు ముహూర్తం ఖరారైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం మహాజాతర 2026 తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ మహా వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో ఈ జాతర జరగనుంది. పూజారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 28వ తేదీన సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో జాతర అధికారికంగా ప్రారంభమవుతుంది. మరుసటి రోజు అంటే జనవరి 29న, జాతరలో అత్యంత కీలక ఘట్టమైన సమ్మక్క తల్లిని చిలకలగుట్ట నుంచి గద్దెలపైకి తీసుకువస్తారు. జనవరి 30వ తేదీన భక్తులు తమ మొక్కులను చెల్లించుకోవడానికి పూర్తి రోజు కేటాయించారు. లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. ఇక చివరి రోజైన జనవరి 31న అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో ఈ మహాజాతర ముగుస్తుందని పూజారుల సంఘం తమ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ తేదీల ప్రకటనతో తెలంగాణ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాల్లోని భక్తులు జాతర ఏర్పాట్లకు సిద్ధమయ్యేందుకు మార్గం సుగమమైంది.

# పాక్ లో మరోసారి ఉగ్రదాడి.. సీనియర్ అధికారి సహా ఐదుగురి మృతి

పొరుగు దేశం పాకిస్థాన్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. ప్రభుత్వ వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రోడ్డు పక్కన అమర్చిన బాంబును పేల్చడంతో ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి సహా ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఉగ్రవాదులకు స్థావరంగా భావించే బజౌర్ జిల్లాలో బుధవారం ఈ దాడి జరిగింది. ప్రభుత్వ పనులపై వెళ్తున్న వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు రిమోట్ కంట్రోల్ ద్వారా ఐఈడీని పేల్చారు. ఈ ఘటనలో అసిస్టెంట్ కమిషనర్ ఫైసల్ సుల్తాన్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని జిల్లా పోలీసు చీఫ్ వకాస్ రఫిక్ తెలిపారు. ఈ దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించుకోనప్పటికీ, దీని వెనుక పాకిస్థానీ తాలిబన్ (టీటీపీ) హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో భద్రతా సిబ్బంది, ప్రభుత్వ అధికారులే లక్ష్యంగా టీటీపీ వరుస దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాకిస్థాన్‌లో టీటీపీ కార్యకలాపాలు మళ్లీ ఊపందుకున్నాయి. గత శనివారం ఇదే ప్రావిన్స్‌లోని ఉత్తర వజిరిస్థాన్‌లో సైనిక కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు మరణించిన విషయం తెలిసిందే. ఆ దాడికి తామే బాధ్యులమని పాకిస్థానీ తాలిబన్ గ్రూప్ లోని హఫీజ్ గుల్ బహదూర్ వర్గం ప్రకటించింది. తాజా ఘటనతో పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో భద్రతా వైఫల్యాలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు జరిగిన ఉగ్రదాడుల్లో 290 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని గణాంకాలు చెబుతున్నాయి.

## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం.. దేశం దాటిస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరించాలనే కొత్త ఆలోచనను ఆయన తాజాగా బయటపెట్టారు. అయితే, ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లోరిడా ఎవర్‌గ్లేడ్స్‌లోని వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. అమెరికా పౌరసత్వం పొందిన కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. "వారు మన దేశానికి కొత్త కాదు, చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. వారిలో చాలామంది ఇక్కడే పుట్టారు. నిజం చెప్పాలంటే, వాళ్లను కూడా ఇక్కడి నుంచి తరిమికొట్టాలని నేను భావిస్తున్నాను. బహుశా ఇదే మా తదుపరి పని కావచ్చు" అని ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, తన ప్రతిపాదనకు చట్టపరమైన వెసులుబాటు ఉందో లేదో తనకు కచ్చితంగా తెలియదని ట్రంప్ అంగీకరించడం గమనార్హం. "చట్టపరంగా మాకు ఆ హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ ఆ అధికారం ఉంటే మాత్రం, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ పని చేస్తాను. ప్రస్తుతం దానిపైనే మేం దృష్టి సారించాం" అని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలకు కొన్ని వారాల ముందే, ఆయన నియమించిన సహాయ అటార్నీ జనరల్ బ్రెట్ షుమేట్ ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉన్న కేసుల్లో పౌరసత్వం రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన యూఎస్ అటార్నీలను ప్రోత్సహించారు. ముఖ్యంగా వేధింపులు, యుద్ధ నేరాలు, మానవ అక్రమ రవాణా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని లక్ష్యంగా చేసుకోవాలని ఆ మెమోలో పేర్కొన్నారు. మరోవైపు, నేరాలకు పాల్పడ్డారనే కారణంతో, అమెరికా గడ్డపై సహజంగా జన్మించిన లేదా సహజ పౌరసత్వం పొందిన వారిని దేశం నుంచి బహిష్కరించడం రాజ్యాంగంలోని ఎనిమిదో సవరణను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూరమైన, అసాధారణ శిక్షలను ఈ సవరణ నిషేధిస్తుందని వారు గుర్తు చేస్తున్నారు. వర్జీనియా యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ అమండా ఫ్రాస్ట్ మాట్లాడుతూ, "పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసానికి పాల్పడటం లేదా దేశద్రోహం వంటి నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే సహజ పౌరుల హోదాను రద్దు చేయగలరు. అంతేకానీ, సంబంధం లేని నేరాలను కారణంగా చూపి ఒకరి పౌరసత్వాన్ని రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించడం కుదరదు" అని ఏబీసీ న్యూస్‌కు వివరించారు. ట్రంప్ సందర్శించిన ఈ నిర్బంధ కేంద్రాన్ని, కఠిన వలస విధానాల కారణంగా విమర్శకులు 'అలిగేటర్ అల్కాట్రాజ్' అని పిలుస్తుండగా, ట్రంప్ మాత్రం ఆ వివాదాన్ని పట్టించుకోకుండా తన పర్యటనను పూర్తి చేశారు.

# ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి.. రైతులకు అండగా నిలుస్తాం

- **లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్**
- **రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని ప్రశంస**
- **కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని వ్యాఖ్య**



రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని పవన్ పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్యాక్స్ నిర్వహణ వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్యాక్స్ నిర్వహణ వ్యవస్థ రైతులకు , ఖాతాదారులకు ప్రయోజనకరంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఐఎస్ఓ అండ్ హెచ్చైవిఎం సర్టిఫికేషన్ అందుకున్న సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్ ను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 5 ఏళ్లుగా ప్రజాప్రయోజనాలకే కట్టుబడి, ఉత్తమ పాలనతో నిరంతరంగా సేవలందించడంతో, ఐఎస్ఓ 9001:2015 , హెచ్చైవిఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ను అందుకోవడం గర్వకారణమన్నారు. 1960లో స్థాపితమైన ఈ బ్యాంక్, గత 5 సంవత్సరాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. 2019లో రూ.24.85 కోట్ల డిపాజిట్లు ఉండగా, 2024 నాటికి ఇవి రూ.56.82 కోట్లకు పెరిగాయన్నారు. . అప్పుల జారీ రూ.21.22 కోట్ల నుంచి రూ.32.26 కోట్లకు, ఆస్తుల విలువ రూ.2.9 కోట్ల నుంచి రూ.9.97 కోట్లకు, లాభాలు రూ.53 లక్షల నుంచి రూ.1.25 కోట్లకు పెరిగినట్లు తెలిపారు. ఈ బ్యాంక్‌కు చెందిన రెండు భవనాలు , ఐదు గోదాముల ద్వారా వార్షికంగా రూ.1.53 కోట్ల అద్దె ఆదాయం లభిస్తోందన్నారు. ఈ భవనాలు నాబార్డ్ నుండి రుణంగా పొందిన నిధులతో నిర్మించబడ్డాయన్నారు. ప్రస్తుతం బ్యాంక్ నెలకు రూ.1.19 లక్షల ఈఎంఐ చెల్లిస్తోందన్నారు. ఈ బ్యాంక్ అభివృద్ధి ఇతర ప్యాక్స్కు ప్రేరణగా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నరేంద్ర రాజు, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సిహెచ్ మధుసూదన్, పి. మల్లేష్, జి. కృష్ణ యాదవ్, డి. నరేందర్, బి. మధుసూదన్, ఎం. మదన్ రావు, ఏ. సత్యనారాయణ, సీఈవో కృష్ణ , ఇతర మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ తెలంగాణ నూతన అధ్యక్షులు ఎన్, రామచందర్ రావు కు శుభాకాంక్షలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడు గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచందర్ రావు ను బుధవారం ఆయన నివాసంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పగిడి పెట్టి శాల్వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర ఓబిసి ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, ప్రసాద్ రాజు , డివిజన్ ఉపాధ్యక్షులు గండిరాజు యాదవ్, జగన్ ముదిరాజ్ బస్తీ అధ్యక్షులు. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మద్దతుతో సమాజ సేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ఎత్తరి మారయ్య పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సమక్షంలో స్థానిక నాయకులు, సంఘ ప్రతినిధులు , అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మారయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సేవా ప్రయాణం భగవంతుని ఆశీర్వాదంతో, ప్రజల మద్దతుతో మరింత విస్తరించి, సమాజంలో మరింత గుర్తింపు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూధిమెట్ల సోమేష్ యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జగద్గిరిగుట్ట డివిజన్ సీనియర్ నాయకులు వేణు యాదవ్, వార్డు సభ్యులు సిద్ధిక్ , నిజాంపేట సీనియర్ నాయకులు సాంబశివా రెడ్డి, స్వామి ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సంఘ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈ నెల 4న భ్రమరాంబ దేవి అమ్మవారిని శాఖంబారి దేవి గా అలంకరణ

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 4వ తేది ఆషాడమాస రెండో శుక్రవారాని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీలోని భ్రమరాంబ దేవి అమ్మవారిని శాఖంబారి దేవి అమ్మవారిగా అలంకరించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని శాఖంబారి దేవిరూపంగా మనకు దర్శనం ఇవ్వడం జరుగుతుందన్నారు. భక్తులందరూ ఆలయానికి విచ్చేసి ఆ యొక్క శాఖంబారి దేవి అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. ఉదయం 8:00 గంటలకు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ ఈ యొక్క కుంకుమార్చన సేవలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరన్నారు. అమ్మవారి అలంకరణకై ఎవరైనా కూరగాయలు ఇచ్చే వాళ్ళు ఉంటే ముందు రోజు గురువారం మధ్యాహ్నం వరకు ఆలయంలో సమర్పించాలన్నారు. శుక్రవారం అమ్మవారికి అలంకరించినటువంటి కూరగాయలతోనే ప్రసాద్ రూపకంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క భక్తులందరూ కూడా ఆలయానికి వచ్చి ఆ యొక్క అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు
## ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉంది. రోడ్లపైకి నీరు చేరే పరిస్థితులు ఏర్పడవచ్చు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, బయటకు రావాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా అధికారులు మరియు సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు.సెల్ఫీలు తీసుకోవడానికి పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనుకావద్దని ఆయన సూచించారు.విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తక్షణమే జిల్లా కలెక్టరేట్ లో..లేదా ఆర్డీవో కార్యాలయాల్లో ..ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు, లేదా తమ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు కాల్ చేసి సమాచారం అందించి సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు , అన్ని మండల అధికారులు అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో సంబంధిత రెవెన్యూ, పోలీసు, రోడ్లు, మున్సిపల్, పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం పడుతున్న వర్షాల సందర్భంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండటాన్ని అలవాటుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమయంలో వర్షాలకు తీసుకునే ముందు జాగ్రత్తలు, అప్రమత్తత చర్యలు రాబోయే గోదావరి వరదల సమయంలో కూడా ఉపయోగపడతాయని, ఎప్పుడైనా వచ్చే వరదలకు సకాలంలో స్పందించడానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడానికి అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఐడిఓసి భద్రాది కోత్తగూడెం 08744 241950 , భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం 08743 232444 , భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం వాట్సాప్ 9347910737 , ఐడిఓసి భద్రాది కోత్తగూడెం వాట్సాప్ నంబర్ 9392919747 లకు సంప్రదించాలని కోరారు.



## నిరాధారంగా మీడియాలో
## వ్యక్తిత్వహననం చేస్తే భౌతిక దాడులకైనా వెనుకాడబోం

*** కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఫోన్ ట్యాపింగ్ విషయంలో కాంగ్రెస్‌కు కొమ్ముకాసే కొన్ని ఆంధ్ర మీడియా ఛానెల్స్‌లో బిఆర్ఎస్ పార్టీపైన వ్యక్తిత్వహననం, అసత్యపు ఆరోపణలు చేస్తే భవిష్యత్తులో భౌతిక దాడులకైన వెనకాడబోమని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి హెచ్చరించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్ర మీడియాలోని కొన్ని ఛానెళ్లు బిఆర్ఎస్ పార్టీపైన, కేటీఆర్‌పైన అక్కసుతో వారికి నచ్చినట్టుగా తమ పార్టీ నాయకులపైన అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని వదిలేది లేదని, బిఆర్ఎస్ అంటేనే ఉద్యమ నేపథ్యమని, అసత్య ఆరోపణ చేస్తే ఎవ్వరిని వదిలిపెట్టమని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రతివారం లేదా 15 రోజులకు సత్య దూరమైన విషయాలను తెరపైకి తెస్తూ అందరి దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ అధికారం ఇచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను, ఆరు గ్యారంటీలను అమలు పరచకుండా ఎప్పుడూ బిఆర్ఎస్ పార్టీని ఆడిపోసుకోవడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్, తంగళ్లపల్లి కేటీఆర్ సేన మండల అధ్యక్షులు వంగూరి దిలీప్, నందగిరి భాస్కర్, నాయకులు ఎండి.జహంగీర్, మండల ఉపాధ్యక్షులు మామిడాల విజయ్, కేటీఆర్ సేన మండల ఇన్‌చార్జ్ చందన, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాల్వను శుభ్రం చేసిన ఎంఈవో ప్రభుదయాళ్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షం కారణంగా నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉన్న కాలువను మండల విద్యాశాఖాధికారి ప్రభుదయాళ్ శుభ్రం చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రహదారిపై వర్షపునీరు నిలిచి ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం, ఎంఈవో ప్రభుదయాళ్ స్వయంగా రోడ్డు పక్కన కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. దీంతో రోడ్డుపై నిలిచిన నీరు సాఫీగా పోవడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మున్సిపల్ అధికారులను కోరారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

*** అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి**

**: ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు,వంకలు,చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది.కావున కాలి నడకన , వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు.వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు.ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.


## హైదరాబాద్ మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లిప్త వైఖరి: విజయశాంతి

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణపై కేంద్రం నిర్లిప్త వైఖరి అనుసరిస్తోందనే అనుమానం కలుగుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ వస్తుందనే కారణం వల్లే కేంద్రం మెట్రో విస్తరణ విషయమై జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా విజయశాంతి పోస్టు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిల్లీకి వెళ్లిన ప్రతీసారీ ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రుల్ని కలిసి ఈ విషయంపై ఎన్ని ప్రతిపాదనలు చేసినా ఫలితం కనిపించడం లేదని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో భారాస తర్వాత ఎక్కువ సంఖ్యలో 42 మంది కార్పొరేటర్లు భాజపా వారేనని, మెట్రో విస్తరణకు ఆమోదం పొందేలా వారు చొరవ చూపాలని కోరారు. అప్పుడే తమను నమ్మి ఓటు వేసిన గ్రేటర్ ప్రజలకు న్యాయం చేసిన వారవుతామనే వాస్తవాన్ని వారు గుర్తించాలని సూచించారు. మెట్రో రెండో దశ ప్రతిపాదనపై కేంద్ర మంత్రులను ఒప్పించేందుకు గ్రేటర్ పరిధిలోని భాజపా ఎంపీలతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిజాయతీ నిరూపించుకోవాల్సిన బాధ్యత భాజపా పైనే ఉందని విజయశాంతి పేర్కొన్నారు.



# ఫార్ములా ఈ రేస్ కేసు: ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

* సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు
* ఫార్ములా ఈ-రేస్ కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం
* మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నోటీసులు జారీ
* గురువారం ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని పిలుపు
* నెల రోజుల విదేశీ పర్యటన తర్వాత హైదరాబాద్ వచ్చిన వెంటనే సమన్లు



హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈరేస్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు ఏసీబీ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ నోటీసులు జారీ చేశారు. ఫార్ములా ఈకార్ రేస్ నిర్వహణకు సంబంధించిన కేసులో ఏసీబీ అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11:30 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అర్వింద్ కుమార్‌కు పంపిన నోటీసులో పేర్కొన్నారు. ఈవెంట్ నిర్వహణలో ఆయన పాత్ర, ఇతర ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆయన్ను ప్రశ్నించే అవకాశం ఉంది. గత నెల రోజుల పాటు అర్వింద్ కుమార్ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన జూన్ 30వ తేదీన తిరిగి హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. ఆయన నగరానికి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు తాజాగా ఈ నోటీసులు జారీ చేయడం గమనార్హం. గతంలోనూ ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

## కేబుల్ బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ జామ్



మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ జామ్‌అయింది. దాదాపు రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కేబుల్ బ్రిడ్జిపై నుంచి రోడ్ నెం. 45 వరకూ వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూట్‌లో ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగించడం, రోడ్లు చిన్నగా ఉండటంతో తరచూ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. వర్షం పడితే మరింత నరకంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండటం, అప్పుడప్పుడు వర్షం కూడా కురుస్తుండటంతో రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచిపోతున్నాయని, దీంతో స్లోగా వెళ్లాల్సి వస్తుందని, ఈ మేరకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. జీహెచ్ ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## చంద్రబాబు, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం ఉంది: హరీశ్ రావు


* చంద్రబాబుకు రేవంత్ బ్యాగ్ మ్యాన్ గా మారారన్న హరీశ్
* తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా బనకచర్లకు మద్దతిస్తున్నారని విమర్శ
* రేవంత్ కు బేసిన్ల గురించి తెలియదని ఎద్దేవా



ఏపీ సీఎం చంద్రబాబు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బ్యాగ్ మ్యాన్'గా మారి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రాష్ట్ర హక్కులు, ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం కేవలం తన రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి భవన్‌లో నీటిపారుదల శాఖపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రజెంటేషన్ చూస్తే హైదరాబాద్‌లో కాకుండా అమరావతిలో ఇచ్చినట్లుందని, దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే తయారు చేసిందనే అనుమానం కలుగుతోందని ఆయన ఎద్దేవా చేశారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ సీఎం ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో, ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఆ ప్రజెంటేషన్‌లో ఉద్దేశపూర్వకంగానే చూపించలేదని ఆరోపించారు. "బనకచర్ల కట్టే చంద్రబాబు రేవంత్‌కు దేవుడిలా కనిపిస్తున్నారు. అదే బనకచర్లను ఆపాలని పోరాడుతున్న బీఆర్ఎస్ మాత్రం చచ్చిన పాములా కనిపిస్తోంది" అని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్‌ను చచ్చిన పాముతో పోల్చడంపై హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నిజంగానే చచ్చిన పాము అయితే, కాంగ్రెస్ నేతలు నిద్రలో కూడా దాని గురించే ఎందుకు కలవరిస్తున్నారని ప్రశ్నించారు. పదకొండేళ్లుగా కేంద్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ పార్టీ కూడా చచ్చిన పామేనా? అని ఆయన నిలదీశారు. టెక్నికల్‌గా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినా, ఆయన మనసంతా ఏపీ వైపే ఉందనే విషయం రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. బనకచర్ల విషయంలో రేవంత్ రెడ్డి, చంద్రబాబు మధ్య తెరవెనుక ఒప్పందాలు జరిగాయని హరీశ్ రావు ఆరోపించారు. 2024లో ప్రజాభవన్ వేదికగా రేవంత్ రెడ్డి, బెజవాడ వేదికగా ఉత్తమ్ కుమార్ రెడ్డి గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారని అన్నారు. దీనికి కొనసాగింపుగా, 2024 నవంబర్ 15న, ఆ తర్వాత డిసెంబర్‌లోనూ ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశారని, ఈ లేఖలన్నీ బయటకు వచ్చినా రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఈ కుట్రను తాను ఈ ఏడాది జనవరి 24న ప్రెస్ మీట్‌లో బయటపెట్టానని, ఆ తర్వాతే తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతకు ముందు తేదీ వేసి కేంద్రానికి లేఖ రాశారని హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన పోరాటం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) ప్రక్రియ తాత్కాలికంగా ఆగిందని, ఇది తమ పోరాట ఫలితమేనని స్పష్టం చేశారు. అపెక్స్ కమిటీ సమావేశంలో బనకచర్ల అంశం చర్చకు రాలేదని, కేవలం సముద్రంలోకి వృథాగా పోతున్న 3 వేల టీఎంసీల నీటిపై ఇరు రాష్ట్రాలు కూర్చుని మాట్లాడుకోవాలని మాత్రమే నిర్ణయించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి నదీ బేసిన్లపై కనీస అవగాహన లేదని, అహంకారంతో మాట్లాడితే ప్రజలు అధఃపాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.

## కొండా సురేఖపై ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఫిర్యాదు !






తెలంగాణ మంత్రి కొండా సురేఖకు మరో షాక్ తగిలింది. తెలంగాణ మంత్రి కొండా సురేఖపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు ఎర్రబెల్లి ప్రదీప్ రావు. ఎన్నికల సమయంలో కొండా సురేఖ తప్పుడు అఫిడవిట్ సమర్పించారని ప్రదీప్ రావు వెల్లడించారు. ఇక ఇందులో భాగంగానే కొండా మురళి వ్యాఖ్యలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు ప్రదీప్ రావు. తె లంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొండా సురేఖపై బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసారు ఎర్రబెల్లి ప్రదీప్ రావు . ఇదే విషయంలో ఇప్పటికే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. దీంతో ఈ వ్యవహారంలో ఈసీ స్పందనపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఇది ఇలా ఉండగా గత ఎన్నికల్లో 70 కోట్లు ఖర్చు చేసి గెలిచామని కొండా మురళి ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. ఎన్నికల కోసం నాకు ఉన్న 500 ఎకరాలలో 16 ఎకరాలు అమ్మేశానని ఈ సందర్భంగా వెల్లడించారు. నా రాజకీయ జీవితంలో ఉన్నత వర్గాలతో పోటీ.. నాకు ఎవరు పైసలు ఇవ్వాల్సిన పనిలేదు అంటూ కొండా మురళి వ్యాఖ్యానించారు. ఇక ఆయన వ్యాఖ్యల నేపథ్యంలోనే... కొండా సురేఖ ఎన్నికపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నారు ప్రతిపక్ష పార్టీ నాయకులు.

### ఆ పదమూడు మంది ఏమయ్యారో..

## సిగాచి ఫ్యాక్టరీ పేలుడు తర్వాత మిస్సింగ్



పాశమైలారంలోని సిగాచీ ఫ్యాక్టరీలో సోమవారం ఉదయం భారీ పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ ఘటనలో 36 మంది కార్మికులు, సిబ్బంది మరణించారని, మరో 34 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. క్షతగాత్రులు ఆసుపత్రులలో చికిత్స పొందుతుండగా.. గుర్తుపట్టలేనంతగా మారిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి బాధిత కుటుంబాలకు అందిస్తున్నట్లు వివరించారు. అయితే, ఈ ప్రమాదం తర్వాత పదమూడు మంది కార్మికులు కనిపించకుండా పోయారని సమాచారం. ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న కార్మికులు, సిబ్బంది సంఖ్యపై గందరగోళం నెలకొంది. అధికారవర్గాల సమాచారం ప్రకారం.. పేలుడు సంభవించిన సమయంలో 143 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. గుర్తించిన మృతదేహాల వివరాల ఆధారంగా 14 మంది చనిపోయారని అధికారికంగా ప్రకటించారు. మిగతా మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, కంపెనీ మాత్రం ఆ సమయంలో 156 మంది విధుల్లో ఉన్నారని చెబుతోంది. మరో పదమూడు మంది సిబ్బంది కనిపించడంలేదని తెలిపింది. ఫ్యాక్టరీలో శిథిలాల తొలగింపు పూర్తయ్యాకే ఈ పదమూడు మంది కార్మికులు, సిబ్బందికి సంబంధించిన వివరాలు తెలిసే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సిగాచి పరిశ్రమ వద్ద మూడో రోజు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. భారీ క్రేన్లు, జేసీబీల సాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు.



## వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. బుధవారం ఉమ్మడి జిల్లా మంత్రులు నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లతో కలిసి ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, అందుకే అన్నదాతలకు ఎలాంటి కష్టం రాకుండా తోడుగా నిలిచామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎనిమిది అంశాలపైనే చర్చ చేయాలని భావించారు. అందులో సాగునీటి పథకాలు, విద్య, వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇల్లు, భూభారతి, ఆరోగ్యం, వైద్యం, మౌలిక సదుపాయాలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమం, మహిళా శక్తి, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి పై సమీక్ష ఎజెండా అంశాలుగా నిర్ణయం చేశారు. కానీ సమయాభావం వల్ల కేవలం వ్యవసాయం, విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, సామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసన మండలి సభ్యులు శంకర్ నాయక్ , నెల్లికంటి సత్యం, శాసనసభ్యులు బాలు నాయక్ , వేముల వీరేశం, కుందూరు జైవీర్ రెడ్డి, మందుల సామేలు, అనిల్ కుమార్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### దేశంలోనే తొలిసారి..

## తెలంగాణ నుంచే శ్రీకారం: డిప్యూటీ సీఎం భట్టి కీలక పిలుపు



హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 4న ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని గ్రామశాఖ అధ్యక్షుడి నుంచి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈనెల 4న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పర్యటన నేపథ్యంలో బుధవారం ఆయన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించి మీడియాతో మాట్లాడారు. గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా సమావేశం కావడం దేశంలోనే ఇది మొదటిసారి అని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రం అనంతరం దేశవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సభ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. నాలుగో తేదీన సాయంత్రం మూడు గంటలకల్లా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఒకరికి మరొకరు సమాచారం చేర వేసుకొని సమన్వయంతో సభకు విచ్చేసి విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు మాట్లాడే కార్యక్రమానికి మొదటి అవకాశం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినందుకు అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో నేరుగా కలిసి మాట్లాడే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు.

## తమిళనాడులో ఘోర ప్రమాదం.. తెలంగాణకు చెందిన ముగ్గురు దుర్మరణం

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారును అతివేగంగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తెలంగాణకు చెందిన ముగ్గురు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. ధర్మపురి సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలో వనపర్తి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. విహారయాత్రలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను తరిమేస్తున్నారు: మంత్రి సీతక్క

ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను బీజేపీ ప్రభుత్వం బలవంతంగా తరిమివేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల అణచివేతలో భాగంగానే ఛత్తీస్ గఢ్ రాష్ట్రఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి కవాసీ లఖ్మాపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ సెంట్రల్ జైలులో ఇవాళ కవాసీ లఖ్మాను ట్రైకార్ చైర్మన్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, తదితర నేతలతో కలిసి ఇవాళ సీతక్క లఖ్మాను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు సంఘీభావం తెలిపిన అనంతరం స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఆరు సార్లు ఎమ్మెల్యే, ఆదివాసిల అగ్ర నేత కవాసీ లఖ్మాని అకారణంగా పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే లఖ్మాని బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తుందని మండిపడ్డారు. నిరాధారమైన కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఏలాంటి సాక్షాదారాలులేకుండానే తప్పుడు కేసులతో ఆరు నెలలుగా జైలులో పెట్టారని మండిపడ్డారు.

# ఐదేళ్లు నేనే ముఖ్యమంత్రి అన్న సిద్ధరామయ్య.. మద్దతివ్వడం తప్ప మార్గం లేదన్న డీకే శివకుమార్

* కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలకు తెర
* ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టీకరణ
* ప్రతిపక్షాల వ్యాఖ్యలను కొట్టిపారేసిన కర్ణాటక ముఖ్యమంత్రి
* సిద్ధరామయ్యకు మద్దతివ్వడం తప్ప మరో మార్గం లేదన్న డీకే శివకుమార్

అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తానని వ్యాఖ్య

కర్ణాటక రాజకీయాల్లో గత కొద్ది రోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన నాయకత్వ మార్పు అంశానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా తెరదించారు. ఐదేళ్ల పూర్తి కాలం తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ఆయన బుధవారం స్పష్టంగా ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఖాయమంటూ సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది. బుధవారం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి మార్పు గురించి వస్తున్న వార్తలపై స్పందించారు. "ఐదేళ్ల పాటు నేనే ముఖ్యమంత్రిగా ఉంటాను.




ఈ విషయంలో మీకెందుకు అనుమానాలు వస్తున్నాయి?" అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని మారుస్తారంటూ బీజేపీ, జేడీఎస్ వంటి ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "వారు కాంగ్రెస్ అధిష్ఠానమా? మా పార్టీ అంతర్గత విషయాల గురించి మాట్లాడటానికి వాళ్లెవరు?" అని ఆయన కొట్టిపారేశారు.

*** అదిష్ఠానం ఏది చెబితే అది చేయడమే నా కర్తవ్యం: డీకే శివకుమార్**

ఈ పరిణామాలపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా స్పందించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. "ఆయనకు అండగా నిలవడం తప్ప నాకు మరో దారి లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. పార్టీ అధిష్ఠానం ఏది చెబితే అది చేయడమే నా కర్తవ్యం" అని శివకుమార్ పేర్కొన్నారు. ఇటీవల కొందరు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలే ఈ నాయకత్వ మార్పు చర్చకు ఆజ్యం పోశాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ, మరో రెండు, మూడు నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని అన్నారు. పార్టీ కోసం ఎవరు కష్టపడ్డారో అందరికీ తెలుసని, అధిష్ఠానం కూడా శివకుమార్ గురించే ఆలోచిస్తోందని వ్యాఖ్యానించారు. దీనికి తోడు, మరో మంత్రి కే.ఎన్. రాజన్న సైతం సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని చెప్పడంతో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి.




## హార్ట్ ఎటాక్ డెత్ లకు కొవిడ్ వ్యాక్సిన్లు కారణం కాదు: ఐసీఎంఆర్

కొవిడ్ వ్యాక్సిన్ వేసుకోవడం వల్లే సడెన్ హార్ట్ స్ట్రోక్ లతో చనిపోతున్నారనే అపోహలకు కేంద్రం, ఐసీఎంఆర్, ఎయిమ్స్ వివరణ ఇచ్చాయి. ఐసీఎంఆర్, ఎయిమ్స్ సంస్థలు చేపట్టిన పరిశోధనల్లో కొవిడ్ వ్యాక్సిన్ కు గుండెపోటుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. ఇటీవలి కాలంలో దేశంలో 45 ఏళ్ల లోపు చాలా మంది వ్యక్తులు కార్డియాక్ అరెస్టు తో చనిపోతున్నారు. దీంతో ఆయా వ్యక్తుల్లో గతంలో ఉన్న అనారోగ్య కారణాలే గుండెపోటులకు కారణమై ఉండొచ్చని తెలిపింది. దీనికి సంబంధించిన అధ్యయనాల రిపోర్టును కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసింది.

*** జన్యు పరమైన లోపాలే కారణామా?**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ 2023 మే ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రీసెర్చ్ నిర్వహించాయి. ఇందులో ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సిన్లు అత్యంత సురక్షితమైనవని వాటి వల్ల ఎలాంటి దుష్ప్రరిమాణాలు లేవని తేల్చి చెప్పారు. గుండె పోటుతో చనిపోతున్న వారిలో జన్యు పరమైన ఇబ్బందులు, గతంలో ఉండే అనారోగ్య సమస్యలు కారణం కావొచ్చని పేర్కొన్నాయి. ఈ మధ్య బాలీవుడ్ నటి షెఫాలీ జరివల్ మృతితో మరోసారి కొవిడ్ వ్యాక్సిన్లపై చర్చ మొదలైంది. కానీ ఈ టీకాలు వేసుకోవడం వల్లే కొవిడ్ నుంచి చాలా మంది ప్రాణాలు కాపాడుకున్నారని.. అనవసరంగా లేనిపోని పుకార్లతో వ్యాక్సిన్ల విశ్వసనీయతను దెబ్బతీయొద్దని రీసెర్చ్ సంస్థలు చెబుతున్నాయి.

### రేఖా గుప్తా ఇంటికి కొత్త హంగులు..

## రూ. 60 లక్షలతో ఆధునికీకరణ పనులు

* నవీకరణ పనుల కోసం టెండర్లు పిలిచిన పీడబ్ల్యూడీ
* టీవీలు, ఏసీలు, సీసీటీవీ కెమెరాల కోసమే లక్షల రూపాయలు
* కేజ్రీవాల్ 'షీష్‌మహల్'ను మ్యూజియం చేస్తానని గతంలో ప్రకటన
* ఒకటి నివాసానికి, మరొకటి క్యాంపు కార్యాలయానికి రెండు బంగ్లాల కేటాయింపు
* 60 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారుల లక్ష్యం

గత ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం 'షీష్‌మహల్'పై తీవ్ర విమర్శలు చేసిన ఢిల్లీ కొత్త సీఎం రేఖా గుప్తా, ఇప్పుడు తన అధికారిక నివాసం కోసం భారీగా ఖర్చు చేయడం చర్చనీయాంశమైంది. ఆమె నివాసం ఉండబోయే రాజ్ నివాస్ మార్గ్ లోని ఒకటో నంబర్ బంగ్లా నవీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ. 60 లక్షలు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ పనుల విభాగం (పీడబ్ల్యూడీ) టెండర్ నోటీసు జారీ చేసింది.

**టెండర్‌లో ఖర్చుల వివరాలు ఇలా..**




పీడబ్ల్యూడీ జూన్ 28న జారీ చేసిన టెండర్ ప్రకారం ఈ నిధులను ప్రధానంగా ఎలక్ట్రికల్ పనుల ఆధునికీకరణ కోసం వినియోగించనున్నారు. ఇందులో భాగంగా రూ. 9.3 లక్షలతో ఐదు టీవీలు, రూ. 7.7 లక్షలతో 14 ఏసీలు, రూ. 5.74 లక్షలతో 14 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు రూ. 2 లక్షలతో నిరంతర విద్యుత్ సరఫరా కోసం యూపీఎస్ వ్యవస్థను కూడా అమర్చనున్నారు. ఇవే కాకుండా రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే 23 సీలింగ్ ఫ్యాన్ల కోసం రూ. 1.8 లక్షలు, ఒక ఓవెన్ టోస్ట్ గ్రిల్ (ఓటీజీ) కోసం రూ. 85,000, ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ కోసం రూ. 77,000, డిష్‌వాషర్ కోసం రూ. 60,000, గ్యాస్ స్టవ్ కోసం రూ. 63,000, మైక్రోవేవ్‌ల కోసం రూ. 32,000, ఆరు గీజర్ల కోసం రూ. 91,000 ఖర్చు చేయనున్నట్లు టెండర్‌లో వివరించారు. అదనంగా రూ. 6 లక్షలకు పైగా ఖర్చుతో 115 దీపాలు, వాల్ లైటర్లు, హ్యాంగింగ్ లైట్లు, మూడు పెద్ద షాండ్లియర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**రెండు బంగ్లాల కేటాయింపు**

ప్రభుత్వం సీఎం రేఖా గుప్తాకు ఒకటి, రెండు నంబర్ల బంగ్లాలను కేటాయించింది. రాజ్ నివాస్ మార్గ్‌లోని ఒకటో నంబర్ బంగ్లాను ఆమె నివాసం కోసం, రెండో నంబర్ బంగ్లాను క్యాంపు కార్యాలయం కోసం వినియోగించనున్నారు. ఈ నెల 4న టెండర్ల బిడ్లు తెరుస్తామని, 60 రోజుల్లోపు పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రేఖా గుప్తా తన సొంత నివాసమైన షాలిమార్ బాగ్‌లోనే ఉంటున్నారు. ఫిబ్రవరిలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కేజ్రీవాల్ నివాసం ఉన్న 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని వివాదాస్పద బంగ్లాలో తాను నివసించనని రేఖా గుప్తా స్పష్టం చేశారు. బీజేపీ 'షీష్‌మహల్' అని పిలిచిన ఆ బంగ్లాను మ్యూజియంగా మారుస్తామని ఆమె ప్రకటించారు. "మేం షీష్‌మహల్‌ను మ్యూజియంగా మారుస్తాం. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. నన్ను ఈ పదవికి ఎంపిక చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు" అని ఆమె ఆనాడు వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ తన అధికారిక నివాసంపై భారీగా ఖర్చు చేశారని బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఆ రాజకీయ ఒత్తిడి నేపథ్యంలోనే కేజ్రీవాల్ ఆ బంగ్లాను ఖాళీ చేశారు.

## హిమాచల్ ప్రదేశ్‌ను వణికిస్తున్న వరదలు..51 మంది మృతి

భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలం అవుతోంది. కొద్దిరోజులుగా అక్కడ కుండపోత వర్షాలు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చాలా చోట్ల రహదారులపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరదల కారణంగా ఇప్పటి వరకు 51 మంది ప్రాణాలు కోల్పోగా, 22 మంది గల్లంతయ్యారని అధికారులు ప్రకటించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో రాష్ట్రంలో ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ మేరకు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ విపత్తుపై ఓ నివేదికను విడుదల చేసింది. జూన్ 20 నుండి జులై 2వ తేదీ వరకు జరిగిన నష్టాన్ని నివేదికలో



పొందుపర్చింది. ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగిపడటం లాంటి ప్రమాదాల వల్ల 12 జిల్లాల్లో మరణాలు సంభవించాయని తెలిపింది. సుమారు 103 మంది గాయపడ్డారని వెల్లడించింది. మండీ జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారని పేర్కొంది.

## పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో ఇద్దరు నిందితులకు బెయిల్

* 2023 డిసెంబర్ 13న పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటన
* నీలమ్ ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు
* ఢిల్లీ విడిచి వెళ్లరాదని, మీడియాతో మాట్లాడకూడదని షరతు



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి అరెస్టయిన ఇద్దరు నిందితులు నీలమ్ ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు ఈరోజు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నిందితులిద్దరూ రూ. 50,000 చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, దానికి తోడు ఇద్దరి చొప్పున హామీ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. బెయిల్ సమయంలో నిందితులు కఠినమైన షరతులను పాటించాల్సి ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ కేసుకు సంబంధించి మీడియాకు గానీ, సోషల్ మీడియాలో గానీ ఎలాంటి ఇంటర్వ్యూలు లేదా ప్రకటనలు చేయరాదని ఆదేశించింది. అలాగే, తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఢిల్లీ విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. దీంతో పాటు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో దర్యాప్తు సంస్థ ముందు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాల్లో పేర్కొంది. 2023 డిసెంబర్ 13న పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటన జరిగిన విషయం తెలిసిందే. సాగర్ శర్మ, మనోరంజన్ డి అనే ఇద్దరు వ్యక్తులు సందర్శకుల గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకి, కలర్ స్మోక్ క్యాన్‌లతో కలకలం సృష్టించారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల నీలమ్ ఆజాద్, అమోల్ షిండే నిరసన తెలుపుతూ అరెస్ట్ అయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, కుట్ర వెనుక ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝాతో పాటు సహ నిందితుడు మహేశ్ కుమావత్‌ను కూడా అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి జైలులో ఉన్న నీలమ్ ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు తాజాగా హైకోర్టులో ఊరట లభించింది.

## లంక వాసులకు గుడ్ న్యూస్.. అందుబాటులోకి స్టార్‌లింక్ సేవలు

శ్రీలంకలో ఇప్పుడు స్టార్‌లింక్ హైస్పీడ్ సాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ విషయాన్ని ఇవాళ (జూన్ 2) ఎక్స్‌లో ప్రకటించింది. దీంతో శ్రీలంకలోని గ్రామీణ ప్రాంతాలు, ఇంటర్నెట్‌కి తక్కువగా యాక్సెస్ ఉన్న ప్రాంతాలు కూడా త్వరితమైన డేటా సేవలకి జతకానున్నాయి. 2024లో టెలికమ్యూనికేషన్ చట్టాల్లో మార్పులు చేసి స్టార్‌లింక్‌కి లైసెన్స్ ఇచ్చిన తర్వాత ఈ సేవలు కార్యరూపం దాల్చాయి. అయితే జూన్ మొదటివారంలోనే శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే నుంచి దీనికి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు ప్రకటన విడుదలైంది. ఈ నిర్ణయానికి ముందు రెండు వారాలపాటు ప్రజాభిప్రాయ సేకరణను చేసి విశ్లేషించామని ప్రకటించింది. స్టార్‌లింక్ సేవల ద్వారా వినియోగదారులు తక్కువ లాటెన్సీతో అధిక స్పీడ్ ఇంటర్నెట్‌ను పొందగలుగుతారు. అయితే అక్కడ వన్‌టైమ్ హార్డ్‌వేర్ ఫీజు 1,18,000




శ్రీలంక రూపాయిలు కాగా.. అన్‌లిమిటెడ్ డేటాకు నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రూ.15,000గా నిర్ణయించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా డిజిటల్ లోపాలను తగ్గిస్తూ, డిజిటల్ సమానత్వాన్ని అందించే దిశగా స్టార్‌లింక్ ఒక పెద్ద ముందడుగు వేసింది. ఇప్పటికే 100+ దేశాల్లో ఈ సేవలు లభిస్తుండగా, భారత్‌లో కూడా స్టార్ లింక్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన లైసెన్స్‌ను టెలికాం విభాగం ప్రారంభించింది. వీటిని పొందిన మూడో కంపెనీగా నిలిచింది. ఇప్పటికే యులెల్సాట్ వన్‌వెబ్, రిలయన్స్ జియో దీనికంటే ముందు అనుమతులు సాధించాయి.

### ఇస్కాన్ దేవాలయంపై కాల్పులు..

## తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత్ డిమాండ్

అమెరికాలో ఇస్కాన్ దేవాలయం పై కాల్పుల కలకలం చోటు చేసుకుంది. అగ్రదేశంలోని శ్రీశ్రీ రాధాకృష్ణ ఇస్కాన్ ఆలయాన్నే లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడ్డారు. ఆలయంలో భక్తులు ఉన్న సమయంలోనే కాల్పులు చోటు చేసుకున్నాయి. సుమారుగా 20 నుండి 30 బుల్లెట్లు ఆలయ గోడల్లో నుండి దూసుకువెళ్లాయి. బుల్లెట్లు తాకడంతో ఆలయం అద్దాలు కూడా పగిలిపోయాయి. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ స్పందించింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొంది. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాని డిమాండ్ చేసింది. ఆలయ నిర్వాహులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో ఈ దాడి



జరిగింది. ఆ సమయంలో కొందరు భక్తులు, అతిథులు ఆలయంలోనే ఉన్నారు. దుండగులు 20 నుండి 30 రౌడ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో కిటికీలు, గోడలు దెబ్బతిన్నాయి. ఈ దాడి హిందూ సమాజంపై విద్వేషంతో జరిగిందని ఇస్కాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆలయంపై దాడి మొదటిసారి కాదని ఆలయ అధ్యక్షుడు వాయ్ వార్డెన్ అన్నారు. కేవలం గత నెలలోనే మూడు సార్లు కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నట్టు చెప్పారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న తమ ఆలయంపై ఇటీవల వరుస దాడులు జరుగుతున్నాయని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం అవ్వకుండా అధికారులు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

# ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

* **సర్వీస్ ఉండగానే ఐపీఎస్‌కు గుడ్ బై చెప్పిన సిద్ధార్థ్ కౌశల్**
* **డీజీపీకి రాజీనామా లేఖ పంపిన ఐపీఎస్ అధికారి**
* **వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి**



ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ తన సర్వీసుకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఆయన ముగింపు పలికారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చాలాకాలంగా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని సిద్ధార్థ్ కౌశల్ తన ప్రకటనలో తెలిపారు. తన భవిష్యత్ జీవిత లక్ష్యాలకు, కుటుంబ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగానే సర్వీసు నుంచి వైదొలగుతున్నట్లు వివరించారు. కొన్ని మీడియా మాధ్యమాల్లో వస్తున్నట్లుగా వేధింపులు లేదా బాహ్య ఒత్తిళ్ల కారణంగా తాను రాజీనామా చేశానన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి. నా నిర్ణయం పూర్తిగా స్వతంత్రమైనది, వ్యక్తిగతమైనది, స్వచ్ఛందమైనది" అని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని కౌశల్ పేర్కొన్నారు. "ఐపీఎస్ అధికారిగా పనిచేయడం నా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన, విలువైన ప్రయాణం. నేను ఈ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా సొంతిల్లుగానే భావించాను. ఇక్కడి ప్రజలు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానంలో ఉంటారు" అని ఆయన అన్నారు. తన వృత్తి జీవితంలో తనకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీనియర్ అధికారులకు, సహోద్యోగులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "మీ మద్దతు, విశ్వాసమే నన్ను ఒక అధికారిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానని సిద్ధార్థ్ కౌశల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సిద్ధార్థ్ కౌశల్, గతంలో కృష్ణా, ప్రకాశం, వైస్సార్ కడప జిల్లాల ఎస్పీగా, రాష్ట్ర లా అండ్ ఆర్డర్ ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తన అధికారిక ప్రకటనలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఏమీ ప్రస్తావించనప్పటికీ, ఢిల్లీ కేంద్రంగా ఒక కార్పొరేట్ సంస్థలో చేరవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.







## ఏపీ వ్యాప్తంగా ఇంటింటికీ
# 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభం

* **'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కూటమి ప్రభుత్వ కొత్త కార్యక్రమం**
* **రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళుతున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు**
* **ఏడాది పాలన, సూపర్ 6 అమలుపై ప్రజలకు ప్రత్యక్షంగా వివరణ**
* **కరపత్రాలు పంచుతూ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ**
* **కూటమి పాలనలో వివక్ష లేకుండా పథకాలు అందుతున్నాయని ప్రజల హర్షం**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తన పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించింది. ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, పరిటాల సునీత, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న 'సూపర్ 6' హామీల పురోగతిని ప్రజలకు వివరిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, కీలక ప్రాజెక్టుల వివరాలు, నియోజకవర్గంలో జరిగిన



అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడమే కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలులో వివక్షను ఎదుర్కొన్నామని, కానీ ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో 'సూపర్ 6' పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా అందుతున్నాయని వారు హర్షం వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన పనులను ప్రజల ముందు ఉంచడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కూడా ఈ ప్రచారంలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా భాగస్వామ్యంతో పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని కూటమి నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'షైనింగ్ టీచర్'.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని సత్కరించిన మంత్రి లోకేశ్



అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులపై పవిత్ర బాధ్యత ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయని చెప్పారు. కర్నూలు జిల్లా జేఎం తండాలోని ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.కల్యాణి కుమారిని 'షైనింగ్ టీచర్' పేరుతో మంత్రి ఘనంగా సత్కరించారు. కల్యాణి కుమారి కుటుంబంతో కలిసి వచ్చి ఉండవల్లి నివాసంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిపెడతామని చెప్పారు. 2017లో జేఎం తండాకు బదిలీ అయిన కల్యాణి తన అంకితభావంతో పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని మంత్రి ప్రశంసించారు. ఉపాధ్యాయులందరికీ ఆమె ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కల్యాణి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించిన ఆయన.. వాటిని ఆచరణలో పెడతామని హామీ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రి తనను సత్కరించడం పట్ల కల్యాణి కుమారి హర్షం వ్యక్తం చేశారు.

# పెద్దారెడ్డికి ఇదే నా ఫైనల్ వార్నింగ్ : జేసీ ప్రభాకర్ రెడ్డి

* **గత ఐదేళ్లలో తనపై, తన కుమారుడిపై అక్రమ కేసులు పెట్టి వేధించారని ఆగ్రహం**
* **వందల ఎకరాల భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణ**
* **తాడిపత్రి ప్రజలే పెద్దారెడ్డిని ఊళ్లోకి రానివ్వడం లేదని వ్యాఖ్య**

వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దారెడ్డి అరాచకాలకు హద్దు లేకుండా పోయిందని, చట్టాలను పక్కనపెట్టి తనపై, తన కుమారుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆయన మండిపడ్డారు. పెద్దారెడ్డికి ఇదే తన చివరి హెచ్చరిక అని, ఆయన అక్రమాల చిట్టా తన వద్ద ఉందని, వాటిని బయటపెడతానని స్పష్టం చేశారు. అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేసీ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిని సర్వనాశనం చేశారని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. "నన్ను 130 రోజులు, నా కుమారుడు అశ్మిత్ రెడ్డిని 75 రోజులు అన్యాయంగా జైల్లో పెట్టారు. అధికారం ఉందని విర్రవీగి మాపై కేసులు పెట్టించారు. ఇప్పుడు అధికారం పోగానే కాళ్లు పట్టుకునే రకంగా వ్యవహరిస్తున్నారు. తాడిపత్రి ప్రజలే పెద్దారెడ్డిని ఊళ్లోకి రానివ్వడం లేదు" అని ఆయన అన్నారు. పెద్దారెడ్డి పెద్ద కుమారుడు ఒక రోగ్ అని, నియోజకవర్గాన్ని దోచుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పెద్దారెడ్డి భూ అక్రమాలపై జేసీ పలు ఆరోపణలు చేశారు. తాను నివసిస్తున్న 6 సెంట్ల ఇంటిని కూడా ఫ్రాడ్ చేసి రిజిస్టర్ చేయించారని, కోటమికుంట్లలో వందల ఎకరాల భూములను కబ్జా చేశారని దుయ్యబట్టారు. రైతులు సోలార్ ప్రాజెక్టుల కోసం ఇచ్చిన భూములను కూడా కన్వర్షన్ చేసి, అక్రమంగా పాసు పుస్తకాలు సృష్టించారని ఆరోపించారు. ఈ అక్రమాలన్నింటికీ సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని త్వరలోనే పంపిస్తానని జేసీ స్పష్టం చేశారు. తనకు కనీసం గన్‌మెన్ కూడా లేరని, కానీ పెద్దారెడ్డి మాత్రం ప్రైవేటు గన్‌మెన్‌లను పెట్టుకుని తిరుగుతున్నారని అన్నారు. ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న పెద్దారెడ్డి తనపై దాడికి ప్రయత్నించే అవకాశం



ఉందని, అయితే తననెవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలకు దిగుతూ, పెద్దారెడ్డి తనను 'ముండమోపి' అని దూషిస్తున్నారని, అసలు ఆయన ఏ జెండరో కూడా తెలియడం లేదని జేసీ ఎద్దేవా చేశారు. పెద్దారెడ్డిని 'డాంకీ', 'క్రాస్ బ్రీడ్' అంటూ తీవ్రమైన పదజాలంతో విమర్శించారు. గతంలో ఆయన సారా కాచారని, ఇసుక అక్రమ రవాణా చేశారని, అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తనకు అలాంటి అవసరం లేదని, మీసం మెలేసి బతుకుతున్నానంటూ జేసీ మీసం తిప్పి తన నిరసనను వ్యక్తం చేశారు. తాను వైసీపీ నేతలందరికీ వ్యతిరేకం కాదని, ఒకప్పుడు తన అన్న దివాకర్ రెడ్డి శిష్యులుగా ఉన్నవారే ఇప్పుడు వైసీపీలో ఉన్నారని గుర్తుచేశారు.




# దమ్ముంటే ప్రజల్లోకి రండి: బొండా ఉమ

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా, ఆయన నియోజకవర్గంలోని ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు బొండా ఉమ తెలిపారు. నెల రోజుల పాటు నియోజకవర్గంలోని మొత్తం 267 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పర్యటించి, నిరంతరం ప్రజల మధ్యనే ఉంటామని ఆయన వివరించారు. ఈ పర్యటనలో స్థానికంగా ఉన్న డ్రైనేజీ వంటి సమస్యలపై ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచనలు జారీ చేశారు. కూటమి పాలనలో అంతా బాగుందని, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ప్రజలు తమతో ఆనందం వ్యక్తం చేశారని ఉమ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని బొండా ఉమ అన్నారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని, స్త్రీ నిధిని ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి అమలు చేస్తాం. సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే రూ. 240 కోట్లు కేటాయించాం. అధికారం ఉన్నా లేకపోయినా మేం ఎప్పుడూ ప్రజల వద్దకే వస్తాం. ఇప్పుడు 'మై టీడీపీ' యాప్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించేలా జవాబుదారీతనంతో పనిచేస్తాం" అని ఆయన తెలిపారు. ఇదే సమయంలో వైసీపీపై బొండా ఉమ తీవ్ర విమర్శలు చేశారు. "మా ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూసి వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారు. అందుకే ప్రస్తుతం వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మీడియా ముందు విమర్శలు చేయడం కాదు, దమ్ముంటే ప్రజల వద్దకు వచ్చి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. మా ప్రభుత్వం ఏ హామీని అమలు చేయలేదో ప్రజల ముందే చెప్పాలి" అని సవాల్ విసిరారు. అసలు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది గత జగన్ ప్రభుత్వమేనని, కూటమి పాలన గురించి అడిగే నైతిక అర్హత కూడా వైసీపీకి లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నవవధువుకి వంకీ ఉంగరం!

**కొన్ని నగలు ఎప్పటికీ పాతబడవు. సరికొత్త నగిషీలతో అలంకారాలతో అమ్మాయిల మనసును దోచుకుంటాయి. అలాంటి వాటిల్లో ఒకటి కల్యాణపు ఉంగరం. దీన్నే పెళ్లి ఉంగరం అనీ అంటారు. వైవాహిక బంధానికి గుర్తుగా వధువుకి తొడిగే ఈ రింగుల డిజైన్లలో వంకీ ఉంగరానికే ప్రాధాన్యత. కాలక్రమంలో పాశ్చాత్య పోకడలతో కపుల్ నేమ్స్, థీమ్స్‌తో మరెన్నో ప్యాటర్న్‌లూ వచ్చాయి. కానీ, పాతకాలపు వంకీ ఉంగరానికి మాత్రం ఆదరణ తగ్గలేదు. పచ్చలు, కెంపులు, ముత్యాలు, వజ్రాలు అద్దుకునీ, సంప్రదాయ టెంపుల్ డిజైన్లను ఇముడ్చుకుని కొత్తందాలతో పెళ్లికూతుళ్ల వేళ్లపై మెరిసిపోతూనే ఉన్నాయి. జీవితకాలపు మధుర జ్ఞాపకాల్ని మిగిల్చే ఇవి భలే ఉన్నాయి కదా!**





# చెత్తను తాకక్కర్లేదు!

**కొన్ని చిన్న వస్తువులుగానే కనిపిస్తాయి. కానీ, వాటి ప్రయోజనాలు మాత్రం బోలెడు. అలాంటి వంటింటి పరికరాలే ఇవి... మీరూ చూసేయండి.**





### తాకే పనిలేకుండా...

సింక్‌లో కూరగాయల వ్యర్థాల్లాంటివి పడిపోతుంటాయి. అయితే, అవి పైపు లోపలికి పోకుండా డ్రైనర్ ఉన్నప్పటికీ, వాటిని చేత్తోనే తీసేయాల్సి వస్తుంది. అలాకాకుండా, ఈ 'ఆటోమేటిక్ పుష్ బటన్ డ్రైనర్'ను తీసుకురండి. దీనికి ఉండే బటన్‌ను నొక్కితే చాలు... డ్రైనర్ అడుగున ఉండే మూత దానంతట అదే తెరచుకుని వ్యర్థాలు బయటకు వచ్చేస్తాయి. పని సులువవుతుంది.

### జ్యూస్‌ల కోసం...



పండ్లరసాలు తాజాగా సిద్ధం చేసుకోవటానికి ఈ ఎలక్ట్రిక్ సిట్రస్ ప్రెస్ ఉపయోగపడుతుంది. దీన్లో నారింజ, ద్రాక్ష, బత్తాయి... లాంటి పండ్ల రసాలు ఈజీగా చేసుకోవచ్చు. ఇది గుజ్జుతో సహా జ్యూస్ చేసి ఆటోమేటిక్‌గా రెడీ చేసేస్తుంది. దీన్ని శుభ్రపరచుకోవటమూ తేలికే.

### ఎప్పుడైనా సిద్ధంగా...



పిల్లలతో ప్రయాణించటం మామూలుగానే కష్టం. అలాంటిది పాలు తాగే పసి పిల్లలుంటే ఇంకా ఇబ్బంది. ఏ సమయంలోనైనా సరే వాళ్లకు వేడి వేడి పాలు తాగించాల్సి ఉంటుంది. అందుకు ఉపయోగపడుతుందీ బాటిల్ మిల్క్ హీటర్. లెదర్‌తో తయారుచేసిన పౌచ్ ఇది. దానికి అటాచ్ అయి ఓ డిజిటల్ డిస్‌ప్లే కూడా ఉంటుంది. దీన్లో ఉష్ణోగ్రతను సెట్ చేసుకునేందుకు ఐదు రకాల మోడ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ పౌచ్‌ను బాటిల్‌కు చుట్టేసి, దానికున్న అడాప్టర్ సాయంతో ఛార్జ్ చేస్తే సరి. పాలు వేడెక్కుతాయి.






## వార్-2ను తెలుగులో రిలీజ్ చేయనున్న నాగవంశీ



**టాకీస్:** యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ యాక్షన్ మూవీ వార్ 2. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తో  కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడుఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే యాక్షన్ ఎపిసోడ్స్ ఫ్యాన్స్ కు విజువల్ ఫీస్ట్ ఇస్తాయని యూనిట్ కూడా బలంగా నమ్ముతోంది. యష్ రాజ్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు రైట్స్ ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశి సుమారు రూ. 90 కోట్లకు కొనుగులు చేసారు. తెలుగు సినిమా చరిత్రలో ఒక నాన్ తెలుగు సినిమాకు ఈ ధర పలకడం హిస్టరీ. కేవలం ఎన్టీఆర్ నటిస్తుండడంతోనే ఆ రేట్ పలికిందనేది వాస్తవం. అనుగుణంగానే వార్ 2 తెలుగు స్టేట్స్ రిలీజ్ ను అదే స్థాయిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు నాగవంశీ. ఆగస్టు 14న తెల్లవారు జామున షోస్ వేసేలా ప్లాన్ చేస్తున్నాడట. ఇప్పటికే అందుకు అందుకోసం థియేటర్స్ తో చర్చలు కూడా చేస్తున్నారట. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా వస్తున్న వార్ 2 ను తెలుగు రాష్ట్రాల్లో మొదటి రోజు బిగ్గెస్ట్ నంబర్స్ ఉండబోతున్నాయి. అలాగే తమిళ సుపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనకరాజ్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా బిగ్గెస్ట్ మల్టీస్టారర్ కూలీతో పోటీగా రిలీజ్ అవుతుంది వార్ 2.

## విశ్వంభర గ్రాఫిక్స్ హాలీవుడ్‌కు అప్పగింత



**టాకీస్:** తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో 'విశ్వంభర' ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా గ్రాఫిక్స్‌కి సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను హాలీవుడ్‌కి చెందిన వీఎఫ్ఎక్స్ స్టూడియోకి అప్పగించినట్లు తెలుస్తుంది. ఈ హాలీవుడ్ స్టూడియో విశ్వంభర సినిమాకు సాలిడ్ అవుట్ పుట్‌ని అందించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పనులు కంప్లీట్ అయిన అనంతరం సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.



## అవన్నీ కట్టుకథలే.. నటనను వదిలే ప్రసక్తే లేదు

**తనపై వస్తున్న పుకార్లను ఖండించిన నటి కోమలి ప్రసాద్**

**నటన వదిలి డాక్టర్ వృత్తిలోకి వెళ్లానన్నది అవాస్తవమన్న నటి**

**సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ పోస్ట్‌తో స్పష్టత**

**చివరి శ్వాస వరకు నటిస్తూనే ఉంటానని తేల్చిచెప్పిన కోమలి**

**త్వరలోనే కొత్త ప్రాజెక్టులతో ముందుకొస్తానని వెల్లడి**

టాకీస్: 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్న యువ నటి కోమలి ప్రసాద్, తన కెరీర్‌కు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. తాను నటనకు స్వస్తి చెప్పి వైద్య వృత్తిలోకి వెళ్లిపోయినట్లు కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఖాతాలు ప్రచారం చేస్తున్నాయని, అందులో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరణ ఇచ్చారు. కొంతకాలంగా తనపై వస్తున్న వదంతులపై కోమలి స్పందిస్తూ... "అందరికీ నమస్కారం. నేను నటనకు పూర్తిగా దూరమై డాక్టర్‌గా మారిపోయానంటూ తప్పుదోవ పట్టించే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ప్రముఖ మీడియా సంస్థలు కూడా వీటిని నిజమన్నట్లు ప్రచారం చేయడం బాధాకరం. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని పేర్కొన్నారు. ఎన్నో కష్టాలు పడి, శివుని ఆశీస్సులతో సినీ రంగంలో ఈ స్థాయికి చేరుకున్నానని, తన కెరీర్‌ను మధ్యలో వదిలే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. ఇలాంటి నిరాధారమైన పుకార్లు తనలో, తన శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళన కలిగిస్తున్నాయని కోమలి ఆవేదన వ్యక్తం చేశారు. "విధి నన్ను ఈ మార్గంలోకి నడిపించిందని నేను నమ్ముతాను. నా చివరి శ్వాస వరకు నటిగా నా ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ, నాపై నమ్మకం ఉంచిన వారందరికీ ధన్యవాదాలు" అని ఆమె అన్నారు. ప్రస్తుతం తాను కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని, త్వరలోనే కొత్త ప్రాజెక్టుల ప్రకటనలతో తన అభిమానులను గర్వపడేలా చేస్తానని కోమలి హామీ ఇచ్చారు. తనపై జరుగుతున్న ఈ అసత్య ప్రచారానికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతోనే ఈ వివరణ ఇస్తున్నట్లు ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు.



## చీరకట్టులో వయ్యారాల జాబిల్లి

**చూపులతో మెస్మరైజ్ చేస్తోన్న కేరళ కుట్టి..**

టాకీస్: అనుపమ పరమేశ్వరన్.. దక్షిణాది సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అవసరంలేని పేరు. ప్రేమమ్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు మొదటి సినిమాతోనే కట్టిపడేసింది. ఈ మూవీతో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. దీంతో బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటూ తక్కువ సమయంలోనే బిజీ హీరోయిన్ గా మారింది.  శతమానం భవతి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది అనుపమ పరమేశ్వరన్. ఆ తర్వాత తెలుగు, తమిళం, మలయాళం భాషలలో యంగ్ హీరోలతో జత కట్టింది. బ్యాక్ టూ బ్యాక్ హిట్ చిత్రాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి స్టార్ హీరోలతో నటించే ఛాన్స్ మాత్రం రాలేదు. ఇక ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. ప్రస్తుతం తెలుగులో పరదా చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాతో పాటు మలయాళంలో జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చిత్రంలో నటిస్తుంది. అయితే ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్ నిరాకరించడం ఇప్పుడు మలయాళీ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశమైంది. సెన్సార్ బోర్డ్ తీరుపై మలయాళీ చిత్రపరిశ్రమ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో విడుదలకు ముందే అనుపమ సినిమా వివాదంలో చిక్కుకుంది. మరోవైపు ఈ మూవీ ప్రమోషన్లలో పాల్గొంటుంది అనుపమ. ఈ క్రమంలో తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. బేబీ పింక్ కలర్ చీరకట్టులో సింపుల్ గా కనిపిస్తూనే ఫిదా చేస్తోంది ఈ కేరళ అందం. ఇన్నాళ్లు సంప్రదాయ లుక్ లో.. ఎంతో పద్ధతిగా కనిపించిన ఈ అమ్మడు.. టిల్లు స్క్వేర్ చిత్రంలో మాత్రం గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేసింది. దీంతో అనుపమను అలా చూసి షాకయ్యారు ఫ్యాన్స్. ఇక ఇప్పుడు ఎప్పటిలాగే పద్ధతిగా కనిపిస్తూనే నెటిజన్లను కట్టిపడేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.

## రామాయణ ఫస్ట్ పార్ట్ షూట్ పూర్తి

**నేడు గ్లింప్స్ విడుదల అంటూ ప్రచారం**

**టాకీస్:** బాలీవుడ్‌లోని ప్రముఖ దర్శకుల్లో ఒకరైన నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్-ఇండియా మైథలాజికల్ మూవీ 'రామాయణ' .తొలి భాగం షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో భారీ అంచనాలు ఇప్పటికే ప్రకటించారు. షూటింగ్ పూర్తయినందున, సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను జూలై 3న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ఈవెంట్‌కు టీమ్ మొత్తం హాజరుకానున్నారు. బెంగళూర్‌లో జరగనున్న ఈ కార్యక్రమం కోసం తారలంతా అక్కడికి బయల్దేరుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిత్రంలో లక్ష్మణుడిగా రవి దూబే కనిపించనుండగా,




పెంచుతుంది. ఇందులో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనుండగా, కన్నడ రాక్‌స్టార్ యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాజాగా షూటింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా సినిమా యూనిట్ కేక్ కట్ చేస్తూ జరుపుకున్న సంబరాలు సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. తొలి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, హనుమాన్‌గా సన్నీ డియోల్, దశరథుడిగా అరుణ్ గోవిల్ కనిపించి అలరించనున్నారు. ఇక యష్ ఈ చిత్రంలో నటించడమే కాకుండా, సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలతో పాటు పలు ఇతర భారతీయ భాషల్లో విడుదల కానుంది. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నట్టు చిత్ర బృందం తెలిపింది. రామాయణం రూపంలో భారతీయ సినీ చరిత్రలో మరో విజువల్ వండర్ రాబోతుందన్న ఊహలు జోరుగా వినిపిస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025  RNI.No. APTEL/2009/29786.